## క్లుప్తంగా

### సన్మానం



ఏటూరునాగారం: నూతనంగా రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్‌గా నియమితులైన వసంత శ్రీనివాస్‌ను శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సన్మానించారు. అనంతరం ఆర్టీఓ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు చిటమట రఘు, గుడ్ల దేవేందర్, గౌసపాషా, ముక్కెర లాలయ్య సన్మానించారు.

### 20న జరిగే ధర్నాను విజయవంతం చేయండి



వెంకటాపురం(కె): ఈ నెల 20వ తేదీన ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, జీవో నంబర్ 3ను చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణబాబు, చంటి, ముత్తయ్య, కన్నయ్య, నాగేశ్వరావు, ప్రసాద్ ఉన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన ఎస్సై



కన్నాయిగూడెం: రోడ్డుపై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని కన్నాయిగూడెం ఎస్సై ఇనిగాల వెంకటేశ్ చేరదీశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం విధుల్లో భాగంగా కన్నాయిగూడెం ఎస్సై వెంకటేశ్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అర్ధనగ్నంగా, పొడవాటి జుట్టుతో మతిస్థిమితం లేని వ్యక్తిని గమనించి వెంటనే అతడిని చేరదీసి ఎండీ రసూల్, ప్రవీణ్ అనే కానిస్టేబుళ్ల సహాయంతో జుట్టును కట్ చేయించి స్నానం చేయించి దుస్తులు వేయించి శుభ్రంగా తయారు చేసి తినుబండరాలు ఇచ్చి ఉండటానికి ఓ చోటును చూపించి మానవత్వాన్ని చాటుకున్నారు. మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని మంచి వ్యక్తిలా కనిపించేలా చేసినందుకు గ్రామస్తులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

### రేషన్ షాపును మూసి వేయించాలి

మంగపేట: మండలంలోని కమలాపురంలో తప్పుడు సర్టిఫికెట్‌తో అక్రమంగా నిర్వహిస్తున్న 10వ నంబర్ రేషన్ షాపును మూసి వేయించాలని తహసీల్దార్ తోట రవీందర్‌కు గ్రామానికి చెందిన సిద్దాబత్తుల జగదీశ్వర్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ.. గ్రామంలోని రేషన్ షాపును గతంలో మేడిపల్లి జ్యోతి కేటాయించారని ఆమె వివాహ అనంతరం అత్తగారింటికి వెళ్లిదని తెలిపారు. కాగా, ఆమె అన్న మేడిపెల్లి వెంకటేశ్వర్లు తన చెల్లెలు ఆరోగ్యం బాగాలేదని తప్పుడు సర్టిఫికెట్ సృష్టించి జ్యోతి పేరుపై ఉన్న రేషన్ షాపును తాత్కాలికంగా అతడి భార్య మేడిపెల్లి వినోదరాణి పేరు మీదకు మార్చుకున్నారని పేర్కొన్నారు. విషయంపై వెంటనే విచారణ జరిపి రేషన్ షాపును వెంటనే మూసి వేయించాలని తహసీల్దార్‌ను కోరారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి



సందీప్(ఫైల్)

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధిలో మనోవేదనతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శివాలయం వీధికి చెందిన పానెం నవ సందీప్ (20) అంగవైకల్యంతో బాధ పడుతున్నాడని తెలిపారు. అంగవైకల్యంతో వివాహం కాదని మనోవేదనకు గురై బుధవారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు యువకుడిని వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా వైద్యశాలలకు తరలించారు. అక్కడి నుంచి కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణాలు పోతున్నా పట్టింపులేదా?

**వెలగని సెంట్రల్ లైటింగ్**
- చల్వాయి–పస్రా మధ్యలో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



చల్వాయిలో వెలగని సెంట్రల్ లైటింగ్

గోవిందరావుపేట: చల్వాయి–పస్రా మధ్యలోని జాతీయ రహదారి 163పై సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నెలల తరబడి సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 3 మేజర్ గ్రామ పంచాయతీలు చల్వాయి, గోవిందరావుపేట, పస్రా జాతీయ రహదారిపై ఉన్నాయి. ఈ మూడు గ్రామాల మీదుగా సుమారు 15 కిలో మీటర్లు పొడుగునా రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. కాని లైట్లు వెలుగక అలంకరణ ప్రాయంగా మాత్రంగా మిగిలిపోయాయి. సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో భారీ వాహనాల వేగానికి గ్రామస్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. నాయకులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగిన ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే తమ బాధ్యత కాదని, జాతీయ రహదారి నిర్వాహకుల బాధ్యత తెలుపుతున్నారని పేర్కొంటున్నారు. జాతీయ రహదారి నిర్వాహకులను అడిగితే బాగు చేయించలేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో చల్వాయి లక్నవరం క్రాస్ రోడ్డు వద్ద నుంచి పస్రా గుండ్ల వాగు బ్రిడ్జి దగ్గర ఉన్న మలుపు వరకు నిత్యం ఎదో ఒక చోట ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నిర్వాహకులు స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని స్థానికులు కోరుతున్నారు. సెంట్రల్ లైట్ల విషయంలో జాతీయ రహదారి ఏఈ రాంమూర్తిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. పాత కాంట్రాక్టర్ సమయం ఐపోయిందని మళ్లీ టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఏదైనా తెలుసుకోవాలంటే ఆఫీస్‌కు వచ్చి తెలుసుకోవాలని.. మీకు ఇవన్నీ చెప్పాల్సిన అవసరం తనకు లేదని సెంట్రల్ లైటింగ్ బాగు చేయించడానికి సమయం పడుతుందంటూ నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పారు.



చీకట్లో పస్రా జాతీయ రహదారి ప్రాంగణం

**సమస్య పరిష్కరించాలి**



మండలంలో జాతీయ రహదారి వెంట సెంట్రల్ లైటింగ్ సమస్యను పరిష్కరించాలి. కొన్ని నెలలుగా లైట్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు, ద్విచక్ర వాహనాదారులు రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో చీకట్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి లైట్లు వచ్చేలా చూడాలి.

– సదానందం, చల్వాయి, గ్రామస్తుడు

**ఇబ్బందులు పడుతున్నారు..**

కొద్ది రోజులుగా పస్రాలో సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడంలేదు. మనుషుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులపై ఉన్నత అధికారులు చర్య తీసుకోవాలి. వెంటనే సమస్యను పరిష్కరించి సెంట్రల్ లైట్లు వెలిగించాలి.

– మల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

## పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్ నాయక్

గోవిందరావుపేట: వెనకబడిన వర్గాల మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంస్థ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ. 40 వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాం పూర్ణచందర్, మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, రేండ్ల శ్రీను, బొల్లం ప్రసాద్, సత్తు భద్రయ్య, కనుకుంట్ల జ్యోతి, పూసల మంజుల, బొడిగే రఘు, తాటిపెల్లి రాజు, సత్తు వినోద, రాజు, శ్రీను, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): నేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్న నవోదయ పరీక్షకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ పరీక్షకు వెంకటాపురం, వాజేడు మండలాల నుంచి 112 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు నవోదయ పరీక్ష ఇన్‌చార్జ్ రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం జీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో 45 మంది ఇంగ్లిష్, 67 మంది తెలుగు మీడియం విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 11.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులు ఉదయం పది గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోల్లే శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

### సర్వే పరిశీలన

మంగపేట: ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకానికి సాగులో ఉన్న భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ తోట రవీందర్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కోమటిపల్లి, నర్సింహాసాగర్, రాజుపేట, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో అధికారులు రెవెన్యూ రికార్డులలో ఉన్న భూములను గూగుల్ ఎర్త్ ద్వారా సర్వే నంబర్ల ఆధారంగా ఆయా భూములను క్షేత్రస్థాయి పరిశీలన సర్వే నిర్వహించారు. ఆయా రైతుల భూములు సాగుకు ఆమోదయోగ్యంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల సర్వేను తహసీల్దార్ పరిశీలించి సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావుతేకుండా నిష్పక్ష పాతంగా నిర్వహించాలని సూచించారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న అధికారులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంట గ్రామంలో గుడుంబా స్థావరాలపై వెంకటాపురం పోలీస్ శాఖ, భూపాలపల్లి టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు ములుగు ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గుడుంబా తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సై లింగయ్య, వెంకటాపురం ఎస్సై జక్కుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న గౌరారపు శ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఏడ్జర్లపల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్ననే సమాచారంతో సోదాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు రూ.3200 విలువ గల గుడుంబాను పట్టుకున్నట్లు తెలిపారు.

## నూతన జీపీగా ప్రకటించాలి



మాట్లాడుతున్న గ్రామస్తులు

ములుగురూరల్: మూడు గ్రామాల పరిధిలో ఉన్న జంగాలపల్లి క్రాస్ రోడ్డు ప్రాంతాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కొత్త జీపీలలో భాగంగా మండలంలో నాలుగు కొత్త గ్రామపంచాయతీలను ప్రకటించారని అన్నారు. మంత్రి సీతక్క గతంలో జంగాలపల్లి క్రాస్ రోడ్డును ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్రాస్ రోడ్డును నూతన జీపీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సామల రమేశ్, వీరగోని భాస్కర్, గుండేటి అనిల్, సిరికొండ రమేశ్, నాగపూరి హరిగౌడ్, గనిశెట్టి రాజు, రాజమల్లు, యాదగిరి, రాజు, చేరాలు తదితరులు ఉన్నారు.

## ఇందిరా జలప్రభను వర్తింపజేయాలి

వెంకటాపురం(కె): ఇందిరా జలప్రభ పథకం ఎస్సీలకు వర్తింపజేయాలని సమాత సైనిక్ దళ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరా జలప్రభ పథకం ఎస్టీలతో పాటు ఎస్సీలకు అవకాశం కల్పించాలని అన్నారు. ఎస్సీల సాగులో ఉన్న భూములకు సైతం హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామటెంకి నవీన్, జాడీ వెంకటేశ్వర్లు, జానకిరావు, దుర్గయ్య ఉన్నారు.

## గ్రామసభల్లోనే ఎంపిక చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

గోవిందరావుపేట: ఇందిరమ్మ లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా సీపీఎం కార్యాలయంలో శుక్రవారం కడారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఆర్భాటం చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో అక్రమాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. కొంత మంది దళారులు ఇళ్లు ఇప్పిస్తామనిమాయ మాటలు చేప్తే ఎవరు నమ్మవద్దు అని, ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వవద్దని అన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, ముమ్మడి ఉపేంద్రచారి, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేశ్, కొటెం కృష్ణారావు, సామ చంద్రారెడ్డి, అంజాద్, గుండు రామస్వామి, గుండు లెనిన్, మంచాల కవిత, కందుల రాజేశ్వరీ, కన్నోజు సదానందం, కోలెపాక మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై దిగబడిన లారీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొండాపురం గ్రామ సమీపంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఇసుక లారీ శుక్రవారం దిగబడింది. దీతో రోడ్డుపై దాదాపు గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, గ్రామస్తులు దిగబడిన లారీలని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. రహదారి మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్ తవ్వి వదిలి పెట్టాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన మరమత్తులు చేయించేలలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



గోవిందరావుపేట: సూచనలు చేస్తున్న ఎస్సై



కన్నాయిగూడెంలో..

- పస్రా ఎస్సై అచ్చ కమలాకర్

గోవిందరావుపేట: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు ఖచ్చితంగా పాటించాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలోని లారీ ఆఫీస్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు.

కన్నాయిగూడెం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ఇనిగాల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో టాటా మ్యాజిక్ డ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఎస్సై అవగాహన కల్పించారు. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపొద్దని సూచించారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

వాజేడు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. నాలుగో విడత రుణమాఫీ డబ్బులు రైతులు ఖాతాల్లో జమ కావడంతో మండల కేంద్రంలోని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేసిందని మరో నాలుగు పథకాలను జనవరి 26 నుంచి అమలు చేస్తుందన్నారు.

## సన్నాహక సభకు తరలిరావాలి



ములుగు: అభివాదం చేస్తున్న నాయకులు



వెంకటాపురం(ఎం): ప్రచారం చేస్తున్న నాయకులు

ములుగు: సామాజిక వర్గీకరణ పోరులో భాగంగా ఫిబ్రవరి 07న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు, లక్ష డప్పులు మాదిగల మహా సంస్కృతిక సన్నాహక కార్యక్రమంలో భాగంగా నేడు(శనివారం) జిల్లాకేంద్రంలో నిర్వహించే సభకు ప్రజలు హాజరుకావాలని పలువురు నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ మొదలవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, చాకలి హక్కుల పోరాట సమితి నాయకుడు సారంగపాణి, విశ్వకర్మ సంఘం నాయకుడు బ్రహ్మచారి, బీసీ కల్చరల్ ఫోరం జిల్లా నాయకుడు శంకర్‌పటేల్, కళాకారులు గొల్కోండ బుచ్చన్న, రేలా కుమార్, ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు ఇరుగుపైడి మాదిగ, జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు మాదిగ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

**మాదిగల ప్రదర్శనను జయప్రదం చేయాలి**

వెంకటాపురం(ఎం): జిల్లా కేంద్రంలో నేడు (శనివారం) నిర్వహించే మాదిగల ప్రదర్శనకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మాదిగ దండోరా నాయకులతో సందర్శించి ప్రదర్శనకు తరలిరావాలని ప్రచారాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 7న హైదారాబాద్‌లో వేయి గొంతులు, లక్ష డప్పుల మాదిగల మహా ప్రదర్శనలో భాగంగా శనివారం ములుగులో ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరె లింగస్వామి, దొమ్మటి రమేష్, సుమన్, మహేందర్, ధర్మేంధర్, రాజేందర్, అఖిల్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన ట్రాక్టర్, కారు







ఆస్పత్రి వద్ద క్షతగాత్రులు

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి–తాడ్వాయి మధ్యలోని 163 జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం కారు, ట్రాక్టర్ ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేట మండలం జల్లిగ్రామం నుంచి పలువురు కారులో మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో చిన్నబోయినపల్లి సమీపంలోని చింతలమోరి సమీపంలో కన్నాయిగూడెం మండలం చిట్యాల నుంచి మడప రాంబాబు ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ మేడారం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు సడన్‌గా బ్రేక్‌లు పడి కారుకు ఒకేసారి అడ్డం తిరిగింది. దీంతో వేగంగా వస్తున్న కారు ట్రాక్టర్ మధ్య భాగాన్ని ఢీకొట్టింది. కారు, ట్రాక్టర్ రెండు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఆశాబీకి రెండు కాళ్లు విరిగిపోగా, మహబూబ్‌పాషాకు కంటి ఎముక, కాలు విరిగింది. నాగులమీర తలకు గాయం అయింది. అలాగే మరో వ్యక్తి యాకూబీ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ట్రాక్టర్ డైవర్ రాంబాబు తలకు గాయమైంది. ఈ సంఘటనను పోలీసులు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో సామాజిక ఆస్పత్రికి తరలించారు.

## రేపు తెలంగాణ ఉద్యమకారుల జైత్రయాత్ర

వెంకటాపురం(ఎం): మానుకోటలో ఈనెల 19న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల జైత్రయాత్రను విజయవంతం చేయాలని టీయూఎఫ్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడంలో కాలయాపన చేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి ఏడాది గడిచిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు. మానుకోటలో నిర్వహించే జైత్రయాత్రకు జిల్లాలోని ఉద్యమకారులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.